ప్రజాశక్తి
బుధవారం 22 ఫిబ్రవరి 2023 5 అనంతపురం

పట్టభద్రుల పీడీఎఫ్ ఎమ్మెల్సీ అభ్యర్థి పోతుల నాగరాజు

ఉపాధ్యాయ పీడీఎఫ్ ఎమ్మెల్సీ అభ్యర్థి కత్తి నరసింహారెడ్డి

గుత్తిలో.. భయపెడుతున్న దోపిడీలు



గుత్తి పట్టణం, పరిసర ప్రాంతాల్లో దోపిడీలు జనం కంటిమీద కునుకు లేకుండా చేస్తున్నాయి. నిత్యం ఏదో ఒకచోట దొంగతనం, దోపిడీ ఘటనలు చోటు చేసుకుంటూనే ఉన్నాయి. తాజాగా ఆదివారం రాత్రి ఏకంగా జాతీయ రహదారిపై దుండగులు వాహనాలను ఆపి దోపిడీకి తెగబడ్డారు. ఇలా వరుస ఘటనలతో గుత్తి ప్రాంతం దొంగతనాలకు కేంద్రంగా మారుతోంది. ఇన్ని ఘటనలు జరుగుతున్నా వీటిని నియంత్రించాల్సిన పోలీసులు నిద్రమత్తులో జోగుతున్నారనే విమర్శలు వ్యక్తం అవుతున్నాయి.

- వరుస ఘటనలతో ప్రజలు బెంబేలు
- ఇంటికి తాళం వేస్తే అంతేసంగతులు
- జాతీయరహదారిపై వాహనదారులకూ రక్షణ కరువు
- కొరవడిన పోలీసు నిఘా

ప్రజాశక్తి గుత్తి

గుత్తి ప్రాంతం 44వ జాతీయ రహదారికి అనుకుని ఉంది. ఈ దారి గుండా నిత్యం వేలాది వాహనాలు రాకపోకలు సాగిస్తుంటాయి. వ్యాపార, ఉద్యోగ సముదాయమైన గుత్తికి వివిధ ప్రాంతాల నుంచి వ్యాపారులు, ఉద్యోగులు వస్తుంటారు. ఇలాంటి ప్రాంతంలో నిత్యం దొంగతనాలు జరుగుతుండడంపై ప్రజల్లో తీవ్ర ఆందోళన నెలకొంది. ఈనెల 4వ తేదీన పట్టణంలోని లచ్చానుపల్లి రోడ్డులో నివాసం ఉంటున్న బొలికొండరెడ్డికి చెందిన బికెఆర్ సప్లయర్స్, టీ కేఫ్‌లోకి దొంగలు చొరబడి రూ.25 వేలు నగదుతో పాటు సిగరెట్ బండిళ్లను ఎత్తుకెళ్లారు. జంగాల కాలనీలో ఈనెల 12వ తేదీన ఆదినారాయణ అనే వ్యక్తి ఇంట్లో గుర్తు తెలియని దుండగులు చోరీ చేశారు. ఇంటి తాళాలు పగలగొట్టి బీరువాలోని రూ.లక్ష నగదు, 2.5 తులాల బంగారు నగలను దోచుకెళ్లారు. ఈనెల 20వ తేదీ తెల్లవారుజామున దొంగలు జాతీయ రహదారిపై దారిదోపిడీకి పాల్పడ్డారు. నంద్యాల జిల్లా డోన్ పట్టణంలోని శ్రీనివాసనగర్‌కు చెందిన లారీ డ్రైవర్లు దస్తగిరి, శ్రీనివాసులు లోడుకు సంబంధించి బాడుగ రూ.48వేలు తీసుకుని తిరుగు ప్రయాణం చేస్తుండగా ఆదివారం రాత్రి బాటసుంకులమ్మ ఆలయ వద్ద ముగ్గుర దోపిడీ దొంగలు మారణాయుధాలతో వీరిని బెదిరించి దస్తగిరి వద్ద ఉన్న

రూ.48వేలు, రూ.15వేలు విలువజేసే సెల్‌ఫోన్, శ్రీనివాసులు వద్ద ఉన్న రూ.వెయ్యి నగదును దోపిడీ చేసుకుని వెళ్లారు. ఇదే రోజు పత్తికొండ రోడ్డులో రైల్వే వంతెన వద్ద ఆగిఉన్న లారీపై అదే ముగ్గురు దుండగులు దాడికి పాల్పడ్డారు. లారీ డ్రైవర్ వద్ద ఉన్న రూ.22 వేలు నగదును అపహరించుకు వెళ్లారు. కొత్తపేట బస్టాప్ వద్ద ఆగి ఉన్న బొలేరో వాహనం డ్రైవర్‌ను బెదిరించి రూ.15 వేలు లాక్కొని వెళ్లారు.

కొరవడిన పోలీసు నిఘా

గుత్తి పోలీస్ స్టేషన్‌లో సర్కిల్ ఇన్స్‌పెక్టర్, సబ్ ఇన్స్‌పెక్టర్, నలుగురు అసిస్టెంట్ సబ్ ఇన్స్‌పెక్టర్లు, ఆరుగురు హెడ్ కానిస్టేబుళ్లు, 30 మంది కానిస్టేబుళ్లు విధులు నిర్వహిస్తున్నారు. ఇంత మంది ఉన్నా రాత్రి సమయాల్లో గస్తీ లేకపోవడంతో దొంగలు యథేచ్ఛగా దోపిడీలను చేసుకుని వెళ్తున్నారు. ఈ నెల 20వ తేదీన కొత్తపేట బస్టాండ్ వద్ద ఆపి ఉన్న ఓ ఆటో అద్దాలను దోపిడీ దొంగలు ధ్వంసం చేశారు. ఆటో డ్రైవర్ వెంటనే గుత్తి పట్టణానికి చేరుకుని అక్కడ గస్తీలో ఉన్న ఇద్దరు కానిస్టేబుళ్లకు దారి దోపిడీ సమాచారం ఇచ్చాడు.

కానిస్టేబుళ్లు ఆటో డ్రైవర్‌ను వెంటబెట్టుకుని కొత్తపేట బ్రిడ్జి వద్దకు వెళ్లారు. అక్కడ ద్విచక్రవాహనాన్ని ఆపుకుని ఉన్న దుండగులను ఆటోడ్రైవర్ గుర్తించి కానిస్టేబుళ్లకు తెలిపారు. కానిస్టేబుళ్లు వారి వద్దకు వెళ్లేలోగా దుండగులు ద్విచక్రవాహనంలో వేగంగా అక్కడి నుంచి తాడిపత్రి వైపు పరారయ్యారు. దుండగులు కళ్లేదుటే పారిపోతున్నా కానిస్టేబుళ్లు ఏ మాత్రం అప్రమత్తం కాకుండా వారి వదిలేసి చూస్తూ ఉండిపోయారు. దోపిడీ దొంగల గురించి ఆ సమయంలో యాడికి, పెద్దపప్పూరు, తాడిపత్రి పోలీస్ స్టేషన్లకు సమాచారం ఇవ్వాల్సి ఉండగా వారు నిర్లక్ష్యంగా వ్యవహరించారనే ఆరోపణలు వినిపిస్తున్నాయి. ఇలా పోలీసు శాఖ నిర్లక్ష్యంగా విధులు నిర్వహిస్తుండడంతో గుత్తిలో దొంగతనాలు నిత్యకృత్యం అయ్యాయని ప్రజలు ఆరోపిస్తున్నారు. ఇప్పటికైనా పోలీసులు నిఘా వ్యవస్థను పటిష్టం చేసి దొంగతనాలు, దోపిడీలను నియంత్రించాలని గుత్తివాసులు కోరుతున్నారు.

నేడు పీడీఎఫ్ ఎమ్మెల్సీ

అభ్యర్థుల నామినేషన్ దాఖలు

ప్రజాశక్తి-అనంతపురం

పశ్చిమ రాయలసీమ స్థానం నుంచి ఎమ్మెల్సీలుగా మండలి ఎన్నికల బరిలోనున్న ఇద్దరు అభ్యర్థులు బుధవారం నాడు నామినేషన్లు దాఖలు చేయనున్నారు. ఉపాధ్యాయ నియోజకవర్గానికి కత్తి నరసింహారెడ్డి, పట్టభద్రుల నియోజకవర్గానికి పోతుల నాగరాజు పిడిఎఫ్ (ప్రోగ్రసివ్ డెమోక్రటిక్ ఫ్రంట్) అభ్యర్థులుగా బరిలోనున్న విషయం తెలిసిందే. ఈ ఇద్దరికి సిపిఎం, సిపిఐతోపాటు ఉద్యోగ, ఉపాధ్యాయ సంఘాలు, ప్రజా సంఘాలు మద్దతు తెలిపాయి. ఇద్దరూ నేడు నామినేషన్లు దాఖలు చేయనుండటంతో అందరూ మద్దతుగా పాల్గొననున్నారు. ఉదయం 10 గంటలకు గుత్తి రోడ్డులోని ద్వారకా చలమారెడ్డి ఫంక్షన్ హాలు నుంచి కలెక్టరేట్ వరకు ప్రదర్శన నిర్వహించనున్నారు. ఇందులో వారికి మద్దతు తెలుపుతున్న ప్రజా సంఘాల నాయకులు, సామాజిక వేత్తలు అందరూ పాల్గొననున్నారు.

నామినేషన్ మహోత్సవానికి తరలిరండి

పోతుల నాగరాజు

అనంతపురంలో బుధవారం నాడు కడప, కర్నూలు, అనంతపురం పట్టభద్రుల ఎమ్మెల్సీ స్థానానికి పీడీఎఫ్ అభ్యర్థిగా వేస్తున్న నామినేషన్ కార్యక్రమానికి ఉద్యోగులు, యువత, ప్రజలు తరలి రావాలని పోతుల నాగరాజు కోరారు. ప్రజాసంఘాలు, విద్యార్థి సంఘాలు, ప్రజాస్వామ్యవాదులు ప్రజా సమస్యలపై అవగాహన ఉన్న గొంతుకు అండగా నిలవాలని కోరారు. తనకు విద్యారంగ సమస్యలపై పూర్తి అవగహన ఉందని పేర్కొన్నారు. పాలక ప్రభుత్వాలపై ప్రజా సమస్యలపై గొంతెత్తే అవకాశం కల్పించేందుకు మండలి ఎన్నికల్లో ఆదరించాలని కోరారు. పేదలు, అణగారిన వర్గాలకు విద్యా, వైద్యం అందించేలా ఒత్తిడి తీసుకొస్తానన్నారు. తన పోరాటానికి ప్రతి ఒక్కరూ అండగా నిలిచి ఆదరించాలని విజ్ఞప్తి చేశారు. యువత, విద్యారంగ నిపుణులు ప్రతి ఒక్కరూ నామినేషన్ కార్యక్రమానికి తరలివచ్చి విజయవంతం చేయాలని పిలుపునిచ్చారు.

ఎసిబి వలలో విఆర్ఒ

రూ.4వేలు లంచం తీసుకుంటూ పట్టుబడ్డ ఉద్యోగి

ప్రజాశక్తి-అనంతపురం

ఎసిబికి పట్టుబడిన విఆర్వో

అనంతపురం జిల్లాలో లంచం తీసుకుంటూ అవినీతి నిరోధక శాఖకు గ్రామ రెవెన్యూ అధికారి చిక్కాడు. మ్యూటేషన్ చేయడానికి ఓ రైతు నుంచి రూ.4 వేలు లంచం తీసుకుంటూ ఉండగా అవినీతి నిరోధక శాఖ అధికారులు వలపన్ని మంగళవారం సాయంత్రం ఆయన్ను పట్టుకున్నారు. దీనికి సంబంధించిన వివరాలు ఇలా ఉన్నాయి. అనంతపురం జిల్లా రాప్తాడు మండలం జి.కొత్తపల్లి గ్రామానికి చెందిన యాలేటి ప్రదీప్‌కుమార్‌రెడ్డి తండ్రి యాలేటీ లక్ష్మిరెడ్డి 2021 జనవరి 11వ తేదిన మృతి చెందారు. ప్రదీప్‌కుమార్‌రెడ్డి తల్లి లక్ష్మిదేవి పేరు మీద పాసుపుస్తకం కోసం దరఖాస్తు చేసుకున్నారు. దరఖాస్తుతో పాటు భూమికి సంబంధించిన పత్రాలన్నీ అందజేసినా పాసుపుస్తకాలు మంజూరు చేయకుండా విఆర్ఒ తిరస్కరించారు. దీనిపై ప్రదీప్‌కుమార్‌రెడ్డి విఆర్ఒ నరసింహులును సంప్రదించగా నాలుగు వేల రూపాయలు లంచమడిగారు. దీంతో బాధితుడు అవినీతి నిరోధక శాఖ అధికారులను సంప్రదించారు. డీఎస్పీ కంజాక్షన్ ఆధ్వర్యంలో మంగళవారం సాయంత్రం వల పన్నీ కొత్తపల్లి గ్రామంలోని సర్పంచి నివాసంలో రూ.నాలుగు వలు లంచం తీసుకుంటూ ఉండగా అవినీతి నిరోధక శాఖ అధికారులు వలపన్ని విఆర్ఒ నరసింహులును పట్టుకున్నారు. ఈ సందర్భంగా ఎసిబి డీఎస్పీ కంజక్షన్ మాట్లాడుతూ ప్రభుత్వ ఉద్యోగి ఎవరైనా లంచమడిగితే తమ దృష్టికి తీసుకొస్తే వారిపై చర్యలు తీసుకుంటామని తెలిపారు. ఈ కార్యక్రమంలో ఇన్స్‌పెక్టర్ మోహన్ ప్రసాద్, శంకర్‌రెడ్డి, సిబ్బంది శాంతిలాల్, శివ గంగాధర్‌రెడ్డి, ఎస్ఐ హరినాథరెడ్డి పాల్గొన్నారు.

రేషన్ బియ్యం ఇవ్వండి : సిపిఎం

ప్రజాశక్తి-అనంతపురం కలెక్టరేట్

అనంతపురం నగరం, రూరల్ పరిధిలో ఉన్న రాజీవ్ కాలనీ పంచాయతీ పరిధిలో ఫిబ్రవరి నెల దాదాపు 93 రేషన్ షాపులలో వందలాది కుటుంబాలకు రేషన్ బియ్యం సరఫరా చేయలేదని, తక్షణం వీరందరికీ పంపిణీ చేయాలని సిపిఎం నగర కార్యదర్శి వి.రామిరెడ్డి కోరారు. ఫిబ్రవరి నెల ఇంటింటికీ సరఫరా చేసే వాహనాల్లో బియ్యం కోటా తక్కువ ఇచ్చి కొన్ని కుటుంబాలకు ఇవ్వలేదన్నారు. కొందరు స్టోర్ డీలర్లు అక్రమంగా బియ్యాన్ని బ్లాక్‌లో అమ్ముతున్నారని చెప్పారు. పేదలకు అందాల్సిన రేషన్ బియ్యం కూడా ఈ విధంగా బయట అమ్మేయడం దారుణం అన్నారు. ఈ విషయమై అధికారులను సంప్రదించగా పల్లెల నుంచి పట్టణాలకు వలస వచ్చిన ప్రజలు ఎక్కువగా ఉన్నందు వల్ల బియ్యాన్ని సక్రమంగా పంపిణీ చేయలేకపోతున్నామంటూ పొంతన లేని సమాధానం చెప్పడం సరికాదన్నారు. అధికారులు స్పందించి కార్డుదారులు అందరికీ బియ్యం సరఫరా చేసేలా చర్యలు తీసుకోవాలని డిమాండ్ చేశారు.

నూర్‌బాషాలకు అన్యాయం

సంఘం వ్యవస్థపక అధ్యక్షులు నూర్ మహమ్మద్

అనంతపురం : నూర్‌బాషా దూదేకుల సంఘానికి రాజకీయ ప్రాధాన్యత లభించడం లేదని నూర్‌బాషా దూదేకుల సంఘం వ్యవస్థాపక అధ్యక్షులు నూర్ మహమ్మద్ పేర్కొన్నారు. మాజీ మున్సిప్ ఛైర్మన్, నూర్‌బాషా దూదేకుల సంఘం వ్యవస్థాపక అధ్యక్షులు నూర్ మహమ్మద్ నివాసంలో మంగళవారం ఏర్పాటు చేసిన మీడియా సమావేశంలో ఆయన మాట్లాడారు. బిసిలకు అధిక ప్రాధాన్యతనిస్తామని వైసిపి అధ్యక్షులు వైఎస్.జగన్మోహన్‌రెడ్డి చెబుతున్నారని, అయితే ఇందులో నూర్‌బాషా దూదేకులకు శాసనమండలి, శాసనసభ స్థానాల్లో ప్రాధాన్యత ఇవ్వలేదని చెప్పారు. దూదేకులలో సరైన ఐక్యతలేదని సజ్జల రామకృష్ణారెడ్డి చెప్పినట్టు ప్రచారం జరుగుతోందన్నారు. ఇది సరైంది కాదని అన్నారు. ముస్లిములకు కూడా రాజకీయ ప్రాధాన్యత దామాషా పద్ధతిలో లభించలేదని చెప్పారు. రాబోయే రోజుల్లోనైనా నూర్‌బాషా దూదేకులకు ప్రాధాన్యత కల్పించాలని డిమాండ్ చేశారు. ఈ కార్యక్రమంలో ఈ సంఘం నాయకులు పూలేటిపల్లి నిజాం, మస్తాన్‌వలి, అలి, గౌస్ తదితరులు పాల్గొన్నారు.

నాయీ బ్రాహ్మణుల అభివృద్ధికి సిఎం తోడ్పాటు

గుత్తి : నాయీ బ్రాహ్మణుల అభివృద్ధికి సీఎం జగన్మోహన్‌రెడ్డి తోడ్పాటును అందిస్తున్నారని కౌన్సిలర్ ఎం.సులోచన, వైసిపి పట్టణ బూత్ కన్వీనర్ ఎం.రంగస్వామి, 14వ వార్డు వైసిపి ఇన్‌ఛార్జి పి.సునీల్ కుమార్ పేర్కొన్నారు. పట్టణంలో మంగళవారం నాయి బ్రాహ్మణులు మాహత్మ గాంధీ విగ్రహానికి పూలమాల వేసి నివాళులర్పించారు. అనంతరం వైఎస్.రాజశేఖర్ రెడ్డి విగ్రహం వద్ద సీఎం వైఎస్.జగన్మోహన్ రెడ్డి చిత్రపటాన్ని ఉంచి పాలాభిషేకం చేశారు. కేకు కట్‌చేసి పంచిపెట్టారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ నాయీ బ్రాహ్మణులకు ఏడాదికి ఒక్కొక్కరికి రూ.10 వేలు చొప్పున ఆర్థిక సాయం చేస్తున్నారని చెప్పారు. బార్బర్ షాపులకు ఉచితంగా విద్యుత్తును సరఫరా చేస్తున్నారని చెప్పారు. నాయీ బ్రాహ్మణులను కులం పేరుతో ఇతరులు దూషించకుండా చట్టం తెచ్చారని కొనియాడారు. సీఎం జగన్ వెంటే తాము ఉంటామని చెప్పారు. కార్యక్రమంలో నాయీ బ్రాహ్మణులు రామస్వామి నారాయణస్వామి, కొత్తపల్లి నారాయణ, రామాంజి, మాణిక్యం, రామాంజనేయులు, సురేష్, శ్రీనివాసులు, కెఎం.రంగనాయకులు, ఉపేంద్ర, రాజేష్, దస్తగిరి, సంజీవ, టైలర్ భాస్కర్, రాజు బాబు, నాగరాజు పాల్గొన్నారు.

ఉచిత వైద్య శిబిరం

ఉరవకొండ : వజ్రకరూరు మండల కేంద్రంలోని టీటీడీ కల్యాణ మండపంలో జడ్పిటిసి సభ్యులు తేజేశ్వరి రమేష్, కురుబ సంఘం రాష్ట్ర యూత్ అధ్యక్షులు వసకేరి రమేష్ బాబు, ఉరవకొండ వార్డు సభ్యులు వసికేరి మల్లికార్జున ఆధ్వర్యంలో మంగళవారం చేపట్టిన మెగా ఉచిత వైద్య శిబిరానికి అనూహ్య స్పందన వచ్చింది. శాంతారాం ఆస్పత్రి వారి సౌజన్యంతో ఏర్పాటుచేసిన ఈ వైద్య శిబిరాన్ని ఎమ్మెల్సీ వై.శివరామిరెడ్డి, మాజీ ఎమ్మెల్యే వై.విశ్వేశ్వరరెడ్డి ప్రారంభించారు. దాదాపు 400 మందికి వైద్య చికిత్సలు నిర్వహించారు. అవసరమైన వారికి మందులు పంపిణీ చేశారు. 70 మందిని కంటి ఆపరేషన్లకు రెఫర్ చేశారు. వైద్య శిబిరానికి వచ్చిన వారికి భోజన సౌకర్యం కల్పించారు.

ప్రతి కళాశాలా న్యాక్ గుర్తింపు సాధించేలా కృషి

జేఎన్టీయూ ఉపకులపతి ఆచార్య రంగజనార్ధన

ప్రజాశక్తి-అనంతపురం

అనంతపురం జేఎన్టీయూ పరిధిలోని ప్రతి కళాశాలా న్యాక్ గుర్తింపు సాధించాలని జేఎన్టీయూ ఉపకులపతి ఆచార్య రంగజనార్ధన పేర్కొన్నారు. మంగళవారం వర్సిటీ ఉపకులపతి కాన్ఫరెన్స్ హాలులో న్యాక్ అడ్వజరీ కమిటీ మీటింగ్ ఆన్‌లైన్‌లో నిర్వహించారు. ఈ సందర్భంగా జేఎన్టీయూ ఉపకులపతి ఆచార్య జి.రంగజనార్ధన మాట్లాడుతూ వర్సిటీ పరిధిలోని ప్రతి కళాశాల న్యాక్ (నేషనల్ అసెస్‌మెంట్ అండ్ అక్రిడేషన్ కౌన్సిల్) గుర్తింపు పొందాలని కమిటీ సూచించింది. భవిష్యత్తులో ప్రతి కళాశాలకూ నాక్ గుర్తింపు తప్పనిసరి అన్నారు. అనంతరం ఉపకులపతి ఆచార్య జి.రంగజనార్ధన ఐ క్యూ ఏసీ డైరెక్టర్ కార్యాలయంలో అనంతపురం, పులివెందుల, కలికిరి ఇంజినీరింగ్ కళాశాలల వైస్ ప్రిన్సిపల్స్, వివిధ విభాగాధిపతులు, అధ్యాపకులతో ఉపకులపతి సమావేశమయ్యారు. ఈ సమావేశంలో ఆయన మాట్లాడుతూ న్యాక్ మంచి గ్రేడ్ వచ్చే విధంగా ప్రతి ఒక్కరూ కృషి చేయాలని సూచించారు. న్యాక్ గుర్తింపు వల్ల వర్సిటి నాణ్యత ప్రమాణాలను పెంపొందించుకోవచ్చునని తెలిపారు. న్యాక్‌లోని వివిధ క్రైటిరియాలను క్షుణ్ణంగా అందరికి వివరించారు. ఎన్ఐ.ఆర్ఎఫ్‌లో మంచి ర్యాంకు సాధించే విధంగా ప్రతి ఒక్కరూ కృషి చేయాలని తెలిపారు. అందరి కృషితోనే వర్సిటీకి మంచి గుర్తింపు తేవచ్చని తెలిపారు. ఈ కార్యక్రమంలో అనంతపురం, పులివెందుల, కలికిరి కళాశాలల వైస్ ప్రిన్సిపల్స్, వివిధ విభాగాధిపతులు, కళాశాలల అధ్యాపకులు పాల్గొన్నారు.

మాట్లాడుతున్న విసి రంగజనార్ధన

విద్యార్థులకు రుచికరమైన భోజనం అందించండి

వార్డెన్లు, వర్కర్లకు బిసి వెల్ఫేర్ డిడి ఆదేశం

భోజనాన్ని పరిశీలిస్తున్న బిసి వెల్ఫేర్ డిడి కుష్బూ కొఠారి

ప్రజాశక్తి-అనంతపురం

విద్యార్థులకు నాణ్యమైన, రుచికరమైన భోజనం అందజేయాలని వార్డెన్లు, వర్కర్లను బీసీ వెల్ఫేర్ డీడీ కుష్బూ కొఠారి ఆదేశించారు. మంగళవారం స్థానిక గిల్డ్ ఆఫ్ సర్వీస్ స్కూల్ పక్కన ఉన్న బిసి హాస్టల్ ప్రాంగణంలో జిల్లాలోని బీసీ హాస్టల్ వార్డెన్లు, వర్కర్లకు భోజనం తయారులో పాటించాల్సిన జాగ్రత్తలపై శిక్షణ తరగతులు నిర్వహించారు. ఈ కార్యక్రమానికి బీసీ వెల్ఫేర్ డీడీ కుష్బూ కొఠారి ముఖ్య అతిథిగా హాజరై మాట్లాడారు. అనంతపురం జిల్లాలోని బీసీ హాస్టల్ విద్యార్థులకు రుచికరమైన, నాణ్యమైన భోజనం అందించడానికి ఈ శిక్షణ తరగతులు నిర్వహిస్తున్నామని చెప్పారు. ఫుడ్ పాయిజన్ ఘటనలు ఎక్కడా జరగకూడదని, ముందస్తు చర్యల్లో భాగంగా భోజనం తయారు చేసేటప్పుడు పరిసర ప్రాంతాలను శుభ్రంగా ఉంచుకోవాలన్నారు. బీసీ హాస్టల్‌లో తయారుచేసిన వంటలను అధికారులు, వార్డెన్లు, వర్కర్లు ఏ విధంగా చేశారని ఆరాతీసి భోజనం తిని సంతృప్తి వ్యక్తం చేశారు. అన్ని హాస్టల్లోనూ ఇలాంటి రుచికరమైన భోజనమే విద్యార్థులకు అందించాలని వార్డెన్లు, వర్కర్లను ఆదేశించారు. ఈ కార్యక్రమంలో అనంతపురం ఎబిసిడబ్ల్యూ సుభాషిని, కళ్యాణదుర్గం ఎబిసిడబ్ల్యూ మస్తాన్, బిసి హాస్టల్ వార్డెన్ల సంఘం జిల్లా అధ్యక్షులు మారుతి ప్రసాద్, ప్రధాన కార్యదర్శి రాజశేఖర్ నాయుడు, కోశాధికారి కంబయ్య, అసోసియేట్ ప్రెసిడెంట్ నాగరాజు, జిల్లాలోని బీసీ హాస్టల్ వార్డెన్లు, వర్కర్లు పాల్గొన్నారు.

సామాజిక విప్లవం శ్రీ శ్రీ..

ప్రజాశక్తి సాహితీ సంస్థ ఆధ్వర్యంలో రెడ్ బుక్ డే

ప్రజాశక్తి-అనంతపురం

సమ సమాజ స్థాపన కోసం కలం పట్టిన విప్లవ యోధుడు శ్రీరంగం శ్రీనివాసరావు అని విశ్రాంత ప్రధానోపాధ్యాయులు, సాహితీవేత్త రియాజుద్దీన్ అన్నారు. మంగళవారం స్థానిక ప్రజాశక్తి కార్యాలయం, ప్రజాశక్తి బుక్ హౌస్ నందు రెడ్‌బుక్ డే నిర్వహించారు. ఈ కార్యక్రమానికి ప్రజాశక్తి సాహితీ సంస్థ మేనేజర్ వేణుగోపాల్ అధ్యక్షత వహించారు. సాహితీవేత్తలు రియాజుద్దీన్, నగరూరు రసూల్ శ్రీశ్రీ గొప్పతనాన్ని తెలియజేశారు. ఆనాడే శ్రీశ్రీ సామాజిక విప్లవానికి నాంది పలికారన్నారు. శ్రీ శ్రీ కళానికి అంతటి గొప్ప ఆశయం, ఆచరణ ఉందన్నారు. అందుకే నేడు శ్రీశ్రీ ఆశయం ప్రజల్లో నాటుకు పోయిందన్నారు. శ్రీశ్రీ అంటే ఒక సామాజిక విప్లవం అని గుర్తు చేశారు. శ్రీశ్రీ కలం నుండి జాలువారిన ప్రతి అక్షరం సమ సమాజ స్థాపనకు నాంది పలికిందని అన్నారు. ఈ కార్యక్రమంలో ప్రజాశక్తి రాష్ట్ర కేంద్ర బాధ్యులు సుధాకర్, జయలక్ష్మి, జానాభి, నాగరాజు, సుధాకర్, మురళి, నాగార్జున, తిమ్మప్ప, శ్రీనివాసులు, డేవిడ్, రవిచంద్ర, రాయుడు, గిరి, కేశవ, మల్లికార్జున తదితరులు పాల్గొన్నారు.

మాట్లాడుతున్న సాహితీవేత్త రియాజుద్దీన్

రౌండ్‌టేబుల్ సమావేశంలో మాట్లాడుతున్న మాజీ ఎమ్మెల్సీ గేయానంద్

మృత్యుంజయ హోమం నిర్వహణ...

రాజ్యాంగ స్ఫూర్తికి విరుద్ధం

- రౌండ్‌టేబుల్ సమావేశంలో మాజీ ఎమ్మెల్సీ డాక్టర్ గేయానంద్

ప్రజాశక్తి-అనంతపురం

శ్రీ కృష్ణదేవరాయ విశ్వవిద్యాలయం ఆధ్వర్యంలో ఈ నెల 24వ తేదీన నిర్వహించ తలపెట్టిన మృత్యుంజయ హోమం రాజ్యాంగ స్ఫూర్తికి విరుద్ధమని తక్షణం దీనిని ఆపాలని మాజీ ఎమ్మెల్సీ డాక్టర్ గేయానంద్ డిమాండ్ చేశారు. ఎస్ఎఫ్ఐ ఆధ్వర్యంలో మంగళవారం సాయంత్రం స్థానిక ఎన్జీవో హోంలో జరిగిన రౌండ్‌టేబుల్ సమావేశానికి ఆయన ముఖ్య అతిథిగా హాజరయ్యారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ మృత్యుంజయ హోమం నిర్వహణ ప్రజల్లో మూఢ విశ్వాసాలను పారదోలి, సైన్సు పట్ల అవగాహన కల్పించాలన్న రాజ్యాంగ స్ఫూర్తికి విరుద్ధమైన చర్యని పేర్కొన్నారు. శాస్త్రీయ ఆలోచనల వైపు ప్రజలను నడిపించాలని రాజ్యాంగం చెబుతోందన్నారు. ఉన్నత విద్యా కేంద్రంగానున్న శ్రీ కృష్ణదేవరాయ విశ్వవిద్యాలయంలో అక్కడి సిబ్బంది చనిపోయారని, వారి సంక్షేమానికి యాగం చేస్తామని వైస్ ఛాన్సలరు చెప్పడం సరైంది కాదని అన్నారు. ఏ పరిస్థితుల్లో అక్కడ మరణాలు సంభవించాయో గుర్తించి వాటి నివారణకు చర్యలు తీసుకోవాల్సిందిపోయి హోమాలు నిర్వహించడం, అది కూడా అందరి నుంచి డబ్బులు వసూలు చేయడం సరైంది కాదని అన్నారు. వ్యక్తిగతంగా ఎవరైనా వారి ఇళ్ల వద్ద చేసుకుంటే ఎవరికీ ఎటువంటి అభ్యంతరాలుండవని చెప్పారు. విశ్వవిద్యాలయంలో పాలకవర్గం పేరుతో చేయడం సరైంది కాదని పేర్కొన్నారు. ఈ సందర్భంగా విద్యార్థి సంఘాల నాయకులు మాట్లాడుతూ ఇది మృత్యుంజయ హోమం కాదని, మారణహోమం అని ఎద్దేవా చేశారు. విశ్వవిద్యాలయంలో జరిగిన మరణాలకు వైస్ ఛాన్సలర్ తీరే కారణమని మండిపడ్డారు ఆయన చేసిన మానసిక ఒత్తిడితోనే సిబ్బంది చనిపోయారని విమర్శించారు. ఇప్పటికైనా వైస్ ఛాన్సలర్ రామకృష్ణారెడ్డి, రిజిస్ట్రార్ లక్ష్మయ్యలు హోమాన్ని నిలుపుదల చేయాలని డిమాండ్ చేశారు. ఈ కార్యక్రమంలో యుటిఎఫ్ రాష్ట్ర నాయకులు కోటేశ్వరప్ప, జిల్లా అధ్యక్షులు గోవిందరాజులు, ఎస్ఎఫ్ఐ రాష్ట్ర ఉపాధ్యక్షులు సూర్యచంద్ర, ఎన్ఎస్‌యుఐ రాష్ట్ర నాయకులు ఎనుముల నరేష్, బీసీ,ఎస్సీఎస్టీ, మైనార్టీ విద్యార్థి సంఘం నాయకులు సురేష్‌యాదవ్, ఎఐఎస్‌బి జిల్లా ప్రధన కార్యదర్శి పృధ్వి, పిడిఎస్‌యు నాయకులు శంకర్, ఎస్ఎఫ్ఐ జిల్లా ప్రధాన కార్యదర్శి పరమేష్, జెవివి నాయకులు రామిరెడ్డి, ఎస్ఎఫ్ఐ నాయకులు విజయ్, చంద్ర, రజిత, గౌసియా తదితరులు పాల్గొన్నారు.

వైద్య శిబిరంలో పాల్గొన్న డాక్టరు అక్బర్ తదితరులు

ఉచిత నేత్ర చికిత్స శిబిరం

అనంతపురం : డాక్టర్ అక్బర్ ఐ ఆసుపత్రి ఆధ్వర్యంలో లోటస్ చిల్డ్రన్స్ స్కూల్లో ఉచిత కంటి వైద్య శిబిరం మంగళవారం నిర్వహించారు. ప్రిన్సిపల్ రోహిణి సహకారంతో 15 మంది పిల్లలకు కంటి పరీక్షలు నిర్వహించారున. పలు జాగ్రత్తలను తెలియజేయడంతో పాటు విద్యార్థులకు అవగాహన కల్పించారు. ప్రముఖ కంటి వైద్య నిపుణులు డాక్టర్ అక్బర్ సాహెబ్, డాక్టర్ సాజియా, లోటస్ స్కూల్ ప్రిన్సిపల్ రోహిణి, వైస్ ప్రిన్సిపల్ శివాని, అక్బర్ కంటి ఆసుపత్రి సీఈవో డాక్టర్ నూర్, సిబ్బంది పాల్గొన్నారు.

ట్రై సైకిల్ వితరణ

నార్పల : నార్పల -3 సచివాలయం ఎఎన్ఎం బి.పవిత్రమ్మ తండ్రి వర్ధంతిని పురస్కరించుకుని మండల కేంద్రంలోని చైతన్య కాలనీకి చెందిన దివ్యాంగుడు చాకలి నరసింహులుకు మూడు చక్రాల వాహనాన్ని మంగళవారం వితరణ చేశారు. ఈ కార్యక్రమంలో ఎఎన్ఎం కుటుంబ సభ్యులు, వైద్యాధికారి ప్రవీణ్ కుమార్, పిహెచ్ఎన్ సరోజమ్మ, ఆశావర్కర్లు పాల్గొన్నారు.

బీమా తక్షణ సాయం అందజేత

డి.హీరేహాల్ : ఆకస్మిక మృతిచెందిన డి.హీరేహాల్ మండలం పులకుర్తి గ్రామానికి చెందిన చాకలి వన్నూరుస్వామి కుటుంబ సభ్యులకు సర్పంచి దోసప్ప వైఎస్ఆర్ బీమా తక్షణ సాయం కింద రూ.10 వేలు మంగళవారం అందజేశారు. మృతుని భార్యకు నగదును ఇచ్చారు. మిగిలిన డబ్బును అధికారులతో మాట్లాడి త్వరలో అందజేస్తామని తెలియజేశారు.

పురాతన శివలింగం లభ్యం

ఆత్మకూరు : మండల కేంద్రానికి చెందిన గూలి కొండమీదరాయుడు తోటలో శివరాత్రి రోజు జెసిబితో పైపులైను పనులు చేస్తుండగా పురాత శివలింగం, గణపతి రూపంలో ఉన్న రాయి, రెండు పాదాలు లభ్యమైన విషయం ఆలస్యంగా వెలుగులోకి వచ్చింది. దీనిపై తొటయజమాని కొండమీదరాయుడు కుమారుడు గూలి వెంకట్‌రెడ్డి మాట్లాడూతూ.. తోటలో బోరు వేసేందుకు జెసిబితో పనులు చేస్తుండగా శివలింగం బయటపడిందని చెప్పారు. జనం పెద్ద ఎత్తున తరలివచ్చి శివలింగానికి పూజలు చేస్తున్నారని తెలియజేశారు.

రూ.10 వేలు విరాళం

రాయదుర్గం రూరల్ :, వాల్మీకి నూతన విగ్రహ ప్రతిష్టాపనకు రాయదుర్గం నియోజకవర్గం వాల్మీకి సంక్షేమ సేవా సమితి అధ్యక్షులు బండి క్రిష్టప్ప మంగళవారం విరాళం అందజేశారు. బొమ్మనహాళ్ మండలం కురవల్లి గ్రామానికి చెందిన వాల్మీకి సోదరులు ఆయనను కలిసి మార్చి 4వ తేదీ వాల్మీకి విగ్రహ ప్రతిష్టాపన విషయాన్ని ఆయనకు తెలియజేశారు. ఆయన రూ.10,100 విరాళంగా అందజేశారు. ఈ కార్యక్రమంలో సెక్రెటరి ఎన్‌టి సిద్దప్ప, ఉపాధ్యక్షులు మల్లన్న, వాల్మీకి యూత్ లీడర్ హరీష్ తదితరులు పాల్గొన్నారు.

రేపు పశువుల వేలం పాట

బుక్కరాయసముద్రం : ఖైదీల వ్యవసాయ క్షేత్రం నందు 23వ తేదీ గురువారం ఉదయం 10.30 గంటలకు 23 ఆవులు, 4 ఎద్దులు, 4 దున్నలు, 1 బర్రె కు బహిరంగ వేలం పాట నిర్వహిస్తున్నట్లు సంబంధిత అధికారులు తెలిపారు. ఇన్‌స్పెక్టర్ ఆఫ్ ప్రిజన్స్ ఆంధ్రప్రదేశ్ మంగళగిరి, గుంటూరు జిల్లాల వారి సమక్షంలో బహిరంగ వేలం పాట నిర్వహిస్తామని చెప్పారు. దరావత్తు చెల్లించి వేలంపాటలో పాల్గొనాలన్నారు. ఇతర వివరాల కోసం 9494633500 నెంబరును సంప్రదించాలని కోరారు.

CHANGE OF NAME

I,YAKKALURU MAHAMMAD MAHAMMAD MUSTAQ (old name) s/o YAKULURU MAHAMMAD AZEEMUDDIN,D.NO.7/1025, Tadipatri Road, Gooty town, Ananthapuram (dt).515401. Have changed my name as **Y.M.MUSTAQ** (New Name) Vide affidavit Dtd:20.02.2023 swom before advocate & Notary R V.Chalapathi,Gooty.

మహారాజశ్రీ గుత్తి జూనియర్ సివిల్ జడ్జివారి కోర్టులో

S.O.P.No.6/2022

Between:
1) వెన్నపూస జయమ్మ
2) వెన్నపూస రాజశేఖర్‌రెడ్డి
3) వెన్నపూస అనిమిరెడ్డి
4) మూల లక్ష్మీదేవి ...అర్జీదారులు

V/s

..నిల్.. రెస్పాండెంట్

పబ్లిక్ నోటీసు

పై అర్జీలో 1వ అర్జీదారురాలికి భర్త అయిన మరియు 2 నుంచి 4 అర్జీదారులకి తండ్రి అయి 24-11-2021వ తేదీ చనిపోయిన వెన్నపూస శంకర్‌రెడ్డికు ఎం.శ్రీనాథ్‌రెడ్డి అను అతని నుంచి రావలసిన ప్రోనోటు తేది:06-04-2021 బాపతు మొత్తమును రాబట్టుకొనుటకు దావా వేయడానికి అవసరమైన "వారసత్వపు సర్టిఫికెట్" పొందు నిమిత్తము పై కోర్టులో పై అర్జీని దాఖలు చేసి ఉన్నారు. సదరు అర్జీమీద ఎవ్వరికైనా అభ్యంతరములు ఉన్నచో 10-03-2023వ తేదీన పై కోర్టు ఎదుట స్వయముగా గానీ లేదా వకీలు ద్వారా గానీ ఉదయం 10.30 గంIలకు హాజరుఅయి మీ అభ్యంతరములు తెలుపుకొనవచ్చును లేని యెడల కోర్టువారు రికార్డుల ఆధారముగా తీర్మానము చేయుదురు.

(కోర్టువారి ఉత్తర్వుల మేరకు)

సి.రమేష్‌నాథరెడ్డి, ఎం.ఎ., ఎం.ఎల్.
వై.హనీఫ్ బాషా,, బి.కామ్, ఎల్.ఎల్.బి
న్యాయవాదులు, తాడిపత్రి.
జడ్.సతీష్, బి.ఎ., ఎల్.ఎల్.బి
న్యాయవాది, గుత్తి.

ప్రజల పక్షాన పోరాడే వారిని గెలిపించాలి

సిపిఐ జిల్లా సహాయ కార్యదర్శి నారాయణస్వామి

మాట్లాడుతున్న సిపిఐ జిల్లా సహాయ కార్యదర్శి నారాయణస్వామి

ప్రజాశక్తి-ఉరవకొండ

పశ్చిమ రాయలసీమ ఎమ్మెల్సీ ఎన్నికల్లో నిత్యం ప్రజా సమస్యల పైన కార్మికులు, ఉద్యోగులు, నిరుద్యోగుల హక్కుల కోసం పోరాటాలను నిర్వహిస్తున్న ఉపాధ్యాయ ఎమ్మెల్సీ అభ్యర్థి కత్తి నరసింహారెడ్డిని, పట్టభద్రుల ఎమ్మెల్సీ అభ్యర్థి పోతుల నాగరాజును ఉద్యోగులు, మేధావులు తమ మొదటి ప్రాధాన్యత ఓటు వేసి గెలిపించాలని సిపిఐ జిల్లా సహాయ కార్యదర్శి నారాయణస్వామి పిలుపునిచ్చారు. మంగళవారం ఉరవకొండ సిపిఐ కార్యాలయంలో స్థానిక నాయకులతో కలిసి ఆయన విలేకరుల సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ఎమ్మెల్సీ ఎన్నికల్లో అధికారపక్షం ప్రజాస్వామ్యానికి పూర్తిగా పాతరేస్తోందన్నారు. గెలుపే లక్ష్యంగా అడ్డదారులు తొక్కుతోందన్నారు. ప్రభుత్వ అధికారును వినియోగించుకుని ఎన్నికల నియమావళిని ఉల్లంఘిస్తోందని ఆరోపించారు. పశ్చిమ రాయలసీమ ఎమ్మెల్సీ ఎన్నికల్లో వైసిపి అభ్యర్థులకు మద్దతుగా ఆర్జేడీ ప్రతాపరెడ్డి సభలు, సమావేశాలు, విందులు ఏర్పాటు చేసి ఓటర్లను ప్రలోభ పెడుతున్నారన్నారు. ఆంధ్ర విశ్వవిద్యాలయం విసి.ప్రసాద్‌రెడ్డి కూడా ప్రభుత్వం బలపరిచిన అభ్యర్థుల గెలుపు కోసం కృషి చేస్తుండడం శోచనీయమన్నారు. వీరిపై చర్యలు తీసుకుని, విధుల నుంచి తప్పించాలని ఎన్నికల సంఘానికి కూడా ఫిర్యాదు చేశామని తెలిపారు. పశ్చిమ రాయలసీమ పట్టభద్రులు, ఉపాధ్యాయ ఎమ్మెల్సీలను గెలిపిస్తే హిందూపురం పార్లమెంటు స్థానాన్ని కేటాయిస్తానని ఆర్జేడీ ప్రతాపరెడ్డికి సిఎం హామీ ఇచ్చారన్నారు. అందుకే ఆర్జేడీ ప్రభుత్వ అధికారిగా కాకుండా వైసిపి కార్యకర్తగా పనిచేస్తున్నారని అన్నారు. ప్రశ్నించిన విద్యార్థి సంఘాల నాయకులపై ఆయనే అక్రమ కేసులు కూడా నమోదు చేయిస్తున్నాడని పేర్కొన్నారు. ఈ ఎమ్మెల్సీ ఎన్నికల్లో తమకు ఓటమి తప్పదని తెలిసి ప్రభుత్వం గెలుపు కోసం బరితెగిస్తోందన్నారు. ఎన్నికల కమిషన్ నిష్పక్షపాతంగా ఎన్నికలను నిర్వహించి ప్రజాస్వామ్యాన్ని కాపాడాలని కోరారు. విలేకరుల సమావేశంలో సిపిఐ జిల్లా కార్యవర్గ సభ్యులు కేశవరెడ్డి, తాలూకా ప్రధాన కార్యదర్శి మల్లికార్జున, సహాయ కార్యదర్శి మనోహర్, ఎఐటియుసి నాయకులు చెన్నారాయుడు, జిల్లా మహిళా సంఘం నాయకురాలు పార్వతీ ప్రసాద్, ఉరవకొండ కార్యదర్శి తలారి మల్లికార్జున, వజ్రకరూరు కార్యదర్శి సుల్తాన్, విడపనకల్లు కార్యదర్శి రమేష్ తదితరులు పాల్గొన్నారు.

పిడిఎఫ్ అభ్యర్థులకు మద్దతుగా ఎన్నికల ప్రచారం

రాయదుర్గం : పశ్చిమ రాయలసీమ ఉపాధ్యాయ ఎమ్మెల్సీ అభ్యర్థి కత్తి నరసింహ రెడ్డి, పట్టభద్రుల ఎమ్మెల్సీ అభ్యర్థి పోతుల నాగరాజు గెలిపించాలని పట్టణంలోని కళాశాలలు, పాఠశాలల్లో ఎఐఎస్ఎఫ్, ఎఐవైఎఫ్ నాయకులు ఎన్నికల ప్రచారం నిర్వహించారు. పశ్చిమ రాయలసీమ అభ్యర్థులు టీచర్ ఎమ్మెల్సీ కత్తి నర్సింహారెడ్డి, పట్టభద్రుల ఎమ్మెల్సీ అభ్యర్థి పోతుల నాగరాజుకి మొదటి ప్రాధాన్యత ఓటు వేసి వేయించి అత్యధిక మెజారిటీతో గెలిపించాలని కోరారు. ఈ కార్యక్రమంలో ఎఐవైఎఫ్ తాలూకా అధ్యక్ష, కార్యదర్శులు కుమార్ నాయక్, కోట్రెష్, ఎఐఎస్ఎఫ్ జిల్లా ఉపాధ్యక్షులు రాజు, నాయకులు కిరణ్, నవీన్, కుబేర, వీరేష్, వంశీ, నిఖిల్ తదితరులు పాల్గొన్నారు.

జిల్లా పోలీసు కార్యాలయం తనిఖీ

ప్రజాశక్తి-అనంతపురం సిటీ

జిల్లా పోలీసు ప్రధాన కార్యాలయంలో అనంతపురం రేంజ్ డిఐజి ఎం.రవిప్రకాష్ ఎస్పీ డాక్టర్ ఫక్కీరప్ప కాగినెల్లితో కలిసి మంగళవారం వార్షిక తనిఖీ చేపట్టారు. ఈ సందర్భంగా జిల్లా పోలీసు కార్యాలయం, స్పెషల్ బ్రాంచి, డీసీఆర్బీ, ఫింగర్ ప్రింట్స్, క్లూస్ టీం తదితర విభాగాల్లో అన్ని రికార్డులను, పనితీరును లోతుగా ఇన్‌స్పెక్షన్ చేశారు. జిల్లా స్పెషల్ బ్రాంచి పటిష్టమైన సమాచార వ్యవస్థతో నిత్యం అప్రమత్తంగా ఉండాలన్నారు. భూకబ్జాదారులు, అరాచక శక్తుల, కిరాయి హంతకుల ముఠాల కదలికలపై నిఘా వేయాలని చెప్పారు. ఫ్యాక్షన్ నియంత్రణ కోసం నిరంతర నిఘా కొనసాగించాలన్నారు. ఫ్యాక్షన్ ప్రభావిత గ్రామాలు, ఫ్యాక్షనిస్టులు, వారి అనుచరుల పట్ల అప్రమత్తంగా ఉండాలన్నారు. పొలిటికల్ వైరి వర్గాలు, పొలిటికల్ ట్రబుల్ మాంగర్స్ పట్ల దృష్టి సారించాలన్నారు. ఎలాంటి అవాంఛనీయ సంఘటనలు జరుగకుండా జాగ్రత్తలు తీసుకోవాలని సూచించారు. అసాంఘిక శక్తుల, చట్ట వ్యతిరేక కార్యకలాపాల సమాచార సేకరణపై దృష్టి పెట్టాలన్నారు. రాబోవు ఎన్నికలను దృష్టిలో ఉంచుకుని జిల్లాలోని సెన్సిటివ్, హైపర్ సెన్సిటివ్, రిమోట్ విలేజీలను గుర్తించాలని ఆదేశించారు. ఆయా గ్రామాల్లో గొడవలు జరుగకుండా ఇప్పటి నుండే కృషి చేయాలి. ఎస్ఐల నుండి డిఎస్‌పిల వరకు అందరూ అధికారులు ఆయా గ్రామాలను సందర్శించి అవాంఛనీయ ఘటనలు జరగకుండా జాగ్రత్తలు తీసుకోవాలన్నారు. ఫోర్జరీలు, భూ కబ్జాలు, దౌర్జన్యాలపై చట్టపరమైన చర్యలు తీసుకోవాలని ఆదేశించారు. ఈ కార్యక్రమంలో అదనపు ఎస్పీ ఇ.నాగేంద్రుడు, సిఐలు తదితరులు పాల్గొన్నారు.

చిరుధాన్యాలతో అధిక దిగుబడులు

జిల్లా వ్యవసాయాధికారి చంద్రనాయక్

ప్రజాశక్తి-బుక్కరాయసముద్రం

చిరుధాన్యాలు పండించి.. అధిక దిగుబడి పొందాలని జిల్లా వ్యవసాయ అధికారి చంద్రానాయక్ సూచించారు. మంగళవారం మండల కేంద్రంలోని వడియం పేట గ్రామంలో క్లస్టర్ స్థాయిలో అమలవుతున్న వేరుశనగ పొలంబడిని పరిశీలించడానికి వచ్చిన ఆయన రైతులను ఉద్దేశించి మాట్లాడారు. రైతులు వేరుశనగ, వరి మాత్రమే ఎక్కువగా పండిస్తున్నారన్నారు. వాతావరణంలో మార్పులు, అధిక పెట్టుబడులు, ఎరువులు, పురుగుమందుల అధిక ధరల, కూలీలు లభించకపోవడం వల్ల దిగుబడులు బాగా తగ్గిపోతున్నాయన్నారు. ఖరీఫ్ సీజన్‌లో వేరుశనగ, వరికి బదులుగా జొన్న, సజ్జ, రాగులు వంటి చిరుధాన్యాలను పండించాలన్నారు. వాటికి ప్రభుత్వం కూడా గిట్టుబాటు ధర కల్పిస్తుందన్నారు. రైతు భరోసా కేంద్రాల ద్వారా ధాన్యాన్ని కొనుగోలు చేస్తుందని చెప్పారు. అనంతపురం ఎడిఎ వెంకటరాముడు మాట్లాడుతూ క్లస్టర్ స్థాయిలో ఉన్న రైతులు విత్తన ధ్రువీకరణ సంస్థ ద్వారా వేరుశనగను సర్టిఫై చేయించుకోవాలని తెలిపారు. ఈ కార్యక్రమంలో జిల్లా వనరుల కేంద్రం వ్యవసాయాధికారులు శంకర్‌లాల్, శ్రీనివాసులు, ప్రవీణ్, రుమానాబేగం, రైతుభరోసా కేంద్రం ఇన్‌ఛార్జిలు, మండల వ్యవసాయాధికారి శ్యాం సుందర్ రెడ్డి, విత్తన ధ్రువీకరణ సంస్థ అధికారి రవి, రైతులు పాల్గొన్నారు.

అరాచక పాలనపై గవర్నర్ జోక్యం చేసుకోవాలి

మాజీ ఎమ్మెల్యే ఆర్.జితేంద్ర గౌడ్

మాట్లాడుతున్న మాజీ ఎమ్మెల్యే జితేంద్ర గౌడ్

ప్రజాశక్తి గుంతకల్లు

రాష్ట్రంలో సిఎం జగన్‌రెడ్డి చేస్తున్న అరాచక, రాక్షస పాలన గన్నవరం దాడితో పరాకాష్టకు చేరిందని ఈ దుష్ట పరిపాలపై గవర్నర్ జ్యోక్యం చేసుకుని ప్రజాస్వామ్యాన్ని పరిరక్షించాలని గుంతకల్లు నియోజక వర్గం టిడిపి ఇన్‌ఛార్జి మాజీ ఎమ్మెల్యే ఆర్.జితేంద్ర గౌడ్ అన్నారు. మంగళవారం గుంతకల్లు పట్టణంలోని ఆయన క్యాంపు కార్యాలయంలో విలేకరులతో మాట్లాడుతూ.. సిఎం జగన్‌రెడ్డి అధికారంలోకి వచ్చినప్పటి నుంచి టిడిపిలోని ఎస్సీ, ఎస్టీ, బీసీ, మైనారిటీ ముఖ్య నేతలను టార్గెట్ చేసుకుని పోలీసులను ఉసిగొలిపి వారిపై తప్పుడు కేసులు పెట్టిస్తూ వేధింపులకు గురిచేస్తున్నారని మండిపడ్డారు. ఈ అరాచక పాలనపై గవర్నర్ జ్యోక్యం చేసుకోవాలన్నారు. గన్నవరంలో ఎమ్మెల్యే వల్లభనేని వంశీ అండ చూసుకొని రౌడీ మూకలు పట్టపగలు టిడిపి కార్యాలయంపై దాడిచేసినా పోలీసులు వారికే సహకరించడం దుర్మార్గం అన్నారు. సిఎం జగన్‌రెడ్డి రాష్ట్రంలో ప్రజా స్వామ్యాన్ని ఖూనీ చేస్తూ అరాచక పాలన సాగిస్తున్నాడన్నారు. దీన్ని ప్రజలు, ప్రజాస్వామ్యవాదులు గమ నిస్తున్నారని ఇది వైసిపి పతనానికి నాంది అన్నారు. వైకాపా ప్రతి నిధులు చివరికి చట్ట సభలలోనూ మైనారిటీకి చెందిన ఎమ్మెల్సీ సభాపతి షరీఫ్‌ను నీవు సాయిబుకు పుట్టవా అని అవమాన పరచడం హేయమైన చర్య అన్నారు. వైసిపి అరాచకాలపై ప్రజలు విసుగెత్తి పోయారన్నారు. రానున్న ఎన్నికల్లో తగిన గుణపాఠం చెబుతామని హెచ్చరించారు. ఈ సమావేశంలో బిసిసెల్ రాష్ట్ర నాయకులు గుమ్మనూరు వెంకటేశులు, మాజీ ఎంపీపీలు రాయల్ రామయ్య, ప్రతాప్ నాయుడు, బిసిసెల్ జిల్లా ఉపాధ్యక్షుడు టి.కేశప్ప, నాయకులు తలారి మస్తానప్ప, జింకల జగన్నాథ్, మహదేవ్, సిమెంటు నారాయణ తదతరులు పాల్గొన్నారు.

శింగనమల : గన్నవరంలో టీడీపీ కార్యాలయంపై వైసీపీ గూండాల దాడిపై టిడిపి నాయకురాలు బండారు శ్రావణిశ్రీ ఆగ్రహం వ్యక్తం చేశారు. రాష్ట్రాన్ని రావణకాష్టంలా మారుస్తున్న జగన్ ఆ మంటల్లో కాలిపోవడం ఖాయమన్నారు. వైసిపి ఉన్మాదులు అరాచకాలు చేస్తుంటే పోలీసులు లాఠీఛార్జి చేయకుండా వైసిపి నాయకులకు వత్తాసు పలుకుతున్నారు. రాష్ట్రంలో శాంతి భద్రతలు ఉన్నాయా అని ప్రశ్నించారు. గవర్నర్ జోక్యం చేసుకుని కారకులపై చర్యలు తీసుకోవాలని కోరారు.

అనంతపురం : రాష్ట్రంలో తెలుగుదేశం పార్టీ కార్యాలయాలపై జరుగుతున్న దాడులపై తక్షణమే ఆంధ్రప్రదేశ్ రాష్ట్ర గవర్నర్ జోక్యం చేసుకోవాలని ప్రజాస్వామ్యాన్ని పరిరక్షించాలని డిమాండ్ చేస్తూ అనంతపురం తెలుగుదేశం పార్టీ బీసీసెల్ ఆధ్వర్యంలో స్థానిక టిడిపి కార్యాలయం ఎదుట నిరసన తెలిపారు. టిడిపి బీసీ సెల్ జిల్లా అధ్యక్షులు ఆవుల కృష్ణయ్య, ప్రధాన కార్యదర్శి పోతుల లక్ష్మీనరసింహులు, నగర అధ్యక్షులు సిమెంటు పోలన్న, నాయకులు కనుమ చౌడయ్య, రాజేష్ నాయక్, కొయ్యగుర్ల పెద్దన్న, బ్యాళ్ల నాగేంద్ర, రాము, చంద్రయుడు, కొండ తదితరులు పాల్గొన్నారు.

లోగో ఆవిష్కరిస్తున్న దృశ్యం

గృహసారథులు సైనికుల్లా పనిచేయాలి

ఎమ్మెల్యే జొన్నలగడ్డ పద్మావతి, మాజీ ఎమ్మెల్యే వై.విశ్వేశ్వరరెడ్డి

ప్రజాశక్తి-ఉరవకొండ

సార్వత్రిక ఎన్నికల్లో గెలుపే ధ్యేయంగా గృహసారథులు సచివాలయ కన్వీనర్లు యుద్ధ సైనికుల్లా పనిచేయాలని మాజీ ఎమ్మెల్యే వై.విశ్వేశ్వరరెడ్డి, యువనేత వై.ప్రణయ్‌రెడ్డి పిలుపునిచ్చారు. మంగళవారం ఉదయం ఉరవకొండ పట్టణం, మధ్యాహ్నం మండలంలోని అన్ని గ్రామాల్లో గృహసారథులు, సచివాలయ కన్వీనర్లు, వాలంటీర్లకు శిక్షణ కార్యక్రమాలు స్థానిక దేవాంగ కల్యాణ మండపంలో నిర్వహించారు. జెసిఎస్ పట్టణ కన్వీనర్ ఆసిఫ్, మండల జెసిఎస్ కన్వీనర్ తేజోనాథ్ అధ్యక్షతన వేర్వేరుగా జరిగిన ఈ సమావేశాల్లో మాజీ సిఎం రాజశేఖర్ రెడ్డి చిత్రపటానికి పూలమాలలు వేసి నివాళులర్పించారు. అనంతరం విశ్వేశ్వరరెడ్డి, ప్రణయ్‌రెడ్డి మాట్లాడుతూ.. దేశం గర్వపడే విధంగా ప్రజా సంక్షేమ పాలన అందిస్తున్న జగన్మోహన్‌రెడ్డి ఆశయాలను ప్రజల చెంతకు తీసుకెళ్లాల్సిన బాధ్యత తమందరిపై ఉందన్నారు. 2024లో గెలుపే లక్ష్యంగా శక్తి వంచన లేకుండా కృషి చేయాలన్నారు. ప్రభుత్వ సంక్షేమం, అభివృద్ధి గురించి ప్రజలకు చెబుతూనే, జగన్మోహన్ రెడ్డిపై కక్షగట్టినట్టుగా వ్యవహరిస్తున్న టిడిపి అధినేత చంద్రబాబు, ఈనాడు, ఏబీఎన్, టీవీ 5 దుష్ట చతుష్టయం చేస్తున్న దుష్ప్రచారాన్ని తిప్పి కొట్టాలని కోరారు. 175 స్థానాలు గెలవాలనే జగన్ లక్ష్యానికి అనుగుణంగా 2024 ఎన్నికల్లో ఉరవకొండలో వైసిపి జెండా ఎగరవేసేందుకు ప్రతి ఒక్కరూ కృషి చేయాలన్నారు. ఈ కార్యక్రమంలో వైసిపి ప్రజాప్రతినిధులు, పట్టణ, మండల నాయకులు, కార్యకర్తలు, ఛైర్మన్లు, డైరెక్టర్లు, గృహసారథులు, సచివాలయ కన్వీనర్లు, వాలంటీర్లు పాల్గొన్నారు.

నార్పల : గృహ సారథులు, వాలంటీర్లు, సచివాలయ కన్వీనర్లు, ప్రజా ప్రతినిధులు సమన్వయతో పనిచేస్తూ ప్రజా సేవలో సీఎం జగన్మోహన్‌రెడ్డికి తోడుగా ఉందామని ఎమ్మెల్యే జొన్నలగడ్డ పద్మావతి పిలుపునిచ్చారు. స్థానిక షాదీఖానాలో సచివాలయ కన్వీనర్లు, గృహసారథులు, వాలంటీర్ల శిక్షణ కార్యక్రమంలో ఎమ్మెల్యే పాల్గొన్నారు. ఈ శిక్షణా కార్యక్రమానికి రాష్ట్ర ప్రభుత్వ విద్యా సలహాదారులు ఆలూరు సాంబశివారెడ్డి, జిల్లా అధ్యక్షులు పైలా నరసింహాయ్య, నియోజకవర్గ పరిశీలకులు రాజారెడ్డి ముఖ్యఅతిథులుగా హాజరయ్యారు. ప్రభుత్వం తరుపున ప్రజలకు మరింత చేరువయ్యే విధానాలను స్క్రీన్ ప్రజెంటేషన్ ద్వారా వివరించారు. ఈ కార్యక్రమంలో జడ్పీ వైస్ ఛైర్‌పర్సన్ నాగరత్నమ్మ, మండల అధక్షుడు నాగేశ్వరరావు, వైసీపీ సీనియర్ నాయకులు సత్యనారాయణరెడ్డి, ఎంఐఎంఎస్ రాష్ట్ర డైరెక్టర్ మండల కన్వీనర్ రఘునాథరెడ్డి, సింగిల్ విండో ఛైర్మన్ లోకనాథ్ రెడ్డి, సర్పంచి సుప్రియ, జిల్లా అధికార ప్రతినిధి మిద్దె కుల్లాయప్ప, వైస్ ఎంపీపీలు వెంకటలక్ష్మి, మల్లేశ్వరయ్య, ఉప సర్పంచ్ శ్రీరాములు, సర్పంచులు, ఎంపీటీసీలు, వైసీపీ నాయకులు, కార్యకర్తలు పాల్గొన్నారు.

అనంత జెఎన్‌టియులో ప్లేస్‌మెంట్ డ్రైవ్

ప్రజాశక్తి-అనంతపురం

అనంతపురం జేఎన్టీయూ ఇంజినీరింగ్ కళాశాల ఈఈఈ విభాగంలో వర్సిటీ ప్లేస్‌మెంట్ డైరెక్టర్ ఆచార్య వి.సుమలత పర్యవేక్షణలో మేధా సర్వ్ ఓ డ్రైవ్స్ ప్రైవేట్ లిమిటెడ్ కంపెనీ క్యాంపస్ ప్లేస్‌మెంట్స్ డ్రైవ్ మంగళవారం నిర్వహించారు. ఇందులో ఒకటవ లెవల్‌లో ఆన్‌లైన్ రిటన్ టెస్టులో 109 మంది విద్యార్థులు ఉత్తీర్ణత సాధించారు. ఈ పరీక్షలో ఉత్తీర్ణులైన విద్యార్థులకు ఇంటర్వ్యూలు జరిపి ఉద్యోగ అవకాశాలను కల్పిస్తామని కంపెనీ ప్రతినిధులు, జేఎన్టీయూ ఇంజినీరింగ్ కళాశాల ప్రాంగణ నియామకాల అధికారి డాక్టర్ జె. శ్రీనివాసులు తెలిపారు.

ఘనంగా మాతృభాషాదినోత్సవం

గుత్తి : పట్టణంలోని క్రీడా మైదానం వద్ద ఉన్న ఏపీ రాష్ట్ర పెన్షనర్ల సంఘ కార్యాలయంలో మాతృభాషా దినోత్సవాన్ని మంగళవారం ఘనంగా నిర్వహించారు. తెలుగు తల్లి చిత్రపటాన్ని ఉంచి నాయకులు పూలమాల వేశారు. ఈ సందర్భంగా నాయకులు తెలుగు భాషను కొనియాడారు. మాతృభాషని ఎన్నడూ మనవరాదని చెప్పారు. కార్యక్రమంలో ఏపీ రాష్ట్ర పెన్షనర్ల సంఘం మండల అధ్యక్షుడు కె.అబుబాకర్ సంయుక్త కార్యదర్శి లక్ష్మినారాయణరెడ్డి, కోశాధికారి ఫకృద్దీన్, అదనపు కార్యదర్శి జేన్నే కుల్లాయిబాబు, నాయకులు నాగేశం, సంపత్, రామచంద్ర, ముల్లా మజీద్ తదితరులు పాల్గొన్నారు.

బుక్కరాయసముద్రం : రోటరీపురం వద్దనున్న ఎస్ఆర్ఐటి కళాశాలలో మాతృభాషా దినోత్సవాన్ని ఘనంగా నిర్వహించారు. ముఖ్య అతిథులుగా, ఎకనమిక్స్ డీన్ శంకర్ లక్ష్మి, మేరీ మాత హాజరయ్యారు. వివిధ క్రీడా పోటీలు నిర్వహించి విజేతలకు బహుమతులు అందజేశారు. ఈ కార్యక్రమంలో సిఎస్ఇ డిపార్ట్‌మెంట్ వీరప్రకాష్, సుమన్, విద్యార్థులు పాల్గొన్నారు.

రాతిదూలం లాగుడు పోటీలు

రాతిదూలం లాగుడు పోటీలను ప్రారంభిస్తున్న దృశ్యం

ప్రజాశక్తి-బొమ్మనహాల్

గోవిందవాడ గ్రామంలో రంగనాథ స్వామి రథోత్సవం సందర్భంగా మంగళవారం క్రీడా పోటీలు, రాతిదూలం లాగుడు పోటీలను నిర్వహించారు. రాతిదూలం లాగుడు పోటీలను మాజీ మంత్రి కాలవ శ్రీనివాసులు ప్రారంభించారు. ఈ పోటీల్లో కబడ్డీ మరియు వాలీబాల్ నిర్వహించగా అందులో పాల్గొన్న గ్రామాలు ఐదు గ్రామాలు ప్రథమ స్థానం దర్గా ఉన్నూర్ రెండో స్థానం గోవిందవాడ గ్రామస్తులు గెలుపొందారు వారికి మొదటి బహుమతి 8000 రెండో బహుమతి 5000 నగదు రూపంలో అందజేసినట్లు ఆలయ పెద్దలు తెలిపారు రాతదూలం పోటీలు కార్యక్రమాన్ని మాజీ మంత్రి కాల్వ శ్రీనివాసులు ప్రారంభించారు. 8 గ్రామాలకు చెందిన ఎద్దులు పాల్గొన్నాయి. విడపనకల్లు మండలం గడే కల్లు గ్రామానికి చెందిన శేఖర్‌కి చెందిన ఎద్దులు మొదటి స్థానంలో నిలిచి రూ.20 వేలు నగదు బహుమతిని గెలుచుకున్నారు. రెండో బహుమతి రూ.15 వేలు ఆత్మకూరు మండలానికి చెందిన మహి రంగనాథరెడ్డి ఎద్దులు, మూడవ బహుమతి రూ.10 వేలు విడపనకల్లు మండలం పెంచలపాడు గ్రామానికి చెందిన భీమలింగప్పకి చెందిన ఎద్దులు కైవశం చేసుకున్నాయి. బహుమతులను టిడిపి నాయకుడు సోమనాథ్ గౌడ్, పొన్నూరు స్వామి చిన్న సుంకన్న చేతుల మీదుగా అందజేశారు. అన్నదాన కార్యక్రమం ఏర్పాటు చేశారు.

నేరాలు ఘోరాలు

50 క్వింటాళ్ల బియ్యం స్వాధీనం

ఐదు ఆటోలు, మినీ వాహనం సీజ్

ప్రజాశక్తి- కుందుర్పి

కళ్యాణదుర్గం నియోజకవర్గం నుంచి కర్నాటకకు అక్రమంగా తరలిస్తున్న 50 క్వింటాళ్ల రేషన్ బియ్యాన్ని స్వాధీనం చేసుకున్నట్లు విజిలెన్స్ సబ్ ఇన్‌స్పెక్టర్ శేషగిరి తెలిపారు. అందిన సమాచారం మేరకు మంగళవారం బెస్తరపల్లి ఉన్నత పాఠశాల సమీపంలో బియ్యం లోడుతో ఉన్న ఐదు ఆటోలు, ఒక మినీ వాహనాన్ని సీజ్ చేశామని చెప్పారు. ఈ దాడుల్లో సిఎస్‌జిటి ప్రవీణ్ కుమార్, రెవెన్యూ అధికారులు పాల్గొన్నారు.

గడ్డివాములకు నిప్పు

ప్రజాశక్తి-నార్పల

మండల పరిధిలోని జంగంరెడ్డిపల్లి గ్రామానికి చెందిన రైతులు చిన్నకుళ్లాయిరెడ్డి కుమారులు కుళ్లాయిరెడ్డి, చిన్న కుళ్లాయిరెడ్డి, చౌడిరెడ్డి, సూర్యనారాయణరెడ్డి విజయభాస్కర్‌రెడ్డి, వారి పెదనాన్నా కుమారుడు బయపరెడ్డికి చెందిన ఆరు గడ్డివాములకు గుర్తుతెలియని వ్యక్తులు సోమవారం అర్ధరాత్రి నిప్పుపెట్టారు. ఈ సంఘటనలో గడ్డి వాములతో పాటు డ్రిప్ పైపులు కాలిపోయాయి. నల్ల బండలు వేడికి పగిలి పోయాయి. రూ.6 లక్షల మేర నష్టం వాటిల్లినట్లు బాధిత రైతులు వాపోయారు. సంఘటనా స్థలాన్ని శింగనమల సిఐ అస్రార్ బాషా, నార్పల ఎస్ఐ రాఘవరెడ్డి పరిశీలించారు. బాధితుల ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసుకుని దర్యాప్తు చేపట్టారు.

షార్ట్ సర్క్యూట్‌తో విద్యుత్ పరికరాలు దగ్ధం

ప్రజాశక్తి-గుత్తి

మండలంలోని అనగానదొడ్డి గ్రామంలో మంగళవారం షార్ట్ సర్క్యూట్ కారణంగా మంటలు చెలరేగి వ్యవసాయ పొలంలో విద్యుత్ పరికరాలు దగ్ధం అయ్యాయి. బాధిత రైతులు హరి, శీనా, రవి లు తెలిపిన వివరాలిల మేరకు గ్రామానికి చెందిన ముగ్గురు రైతులు రబీ సీజన్లో సాగు చేసిన పంటలకు నీరు పెట్టేందుకు వ్యవసాయ బోర్లకు స్టార్టర్ బాక్సులు, విద్యుత్ తీగలను, డ్రిప్ పైపులు ఏర్పాటు చేశారు. అయితే షార్ట్ సర్క్యూట్‌తో వ్యవసాయ పొలంలో అకస్మాత్తుగా మంటలు చెలరేగాయి. విషయం తెలుసుకున్న సమీప పొలాల రైతులు బాధిత రైతులకు సమాచారం అందించారు. రైతులు వచ్చి మంటలు అర్పే లోపు పొలంలోని వాటర్ ఫిల్టర్లు, మూడు స్టార్టర్ బాక్సులతో పాటుగా 20 పైపులు కాలి బూడిద అయ్యాయి. సుమారు 2 లక్షలు అస్తి నష్టం వాటిల్లిందని రైతులు వాపోయారు. షార్ట్ సర్క్యూట్‌తో మంటలు చెలరేగి నష్టం సంభవించిందని రెవెన్యూ అధికారులకు ఫిర్యాదు చేశారు. ప్రభుత్వం ఆదుకోవాలని బాధిత రైతులు కోరారు.

రథోత్సవానికి ఆహ్వానం

ప్రజాశక్తి-ఉరవకొండ

విడపనకల్ మండల పరిధిలోని పాల్తూరు గ్రామంలో జరిగే శ్రీ సుంకలాదేవి రథోత్సవ వేడుకలకు గ్రామస్తులు ఎమ్మెల్సీ వై.శివరామిరెడ్డిని ఆహ్వానించారు. మంగళవారం వారు కొనకొండ్లలోని ఎమ్మెల్సీ శివరాంరెడ్డి ఆయన నివాసంలో కలిశారు. రథోత్సవ వేడుకలకు సంబంధించిన గోడపత్రికలను ఎమ్మెల్సీ చేతుల మీదుగా ఆవిష్కరించారు. ఈనెల 24వ తేదీ శ్రీ సుంకల పార్వతిదేవి రథోత్సవ వేడుకలు నిర్వహిస్తున్నట్లు తెలిపారు. రథోత్సవంలో పాల్గొనాలని ఎమ్మెల్సీ శివరామిరెడ్డిని ఆహ్వానించారు. ఈ కార్యక్రమంలో ఉప సర్పంచి సుంకన్న, ఓబులేసు, మాలింగ, రామకృష్ణ, దివాకర్ గౌడ్, షబ్బీర్, పుండుకురి.సుంకన్న, రాజన్నస్వామి, శ్రీనివాసులు తదితరులు పాల్గొన్నారు.

నేడు సర్వసభ్య సమావేశం

ప్రజాశక్తి-బెలుగుప్ప

స్థానిక మండల పరిషత్ కార్యాలయంలో ఎంపీపీ పెద్దన్న అధ్యక్షతన బుధవారం సర్వసభ్య సమావేశం నిర్వహిస్తున్నట్లు ఎంపీడీవో యాదవేంద్ర మంగళవారం ఒక ప్రకటనలో తెలిపారు. ఈ సమావేశానికి జెడ్‌పిటిసి, ఎంపీటీసీలు, సర్పంచులు, వివిధ శాఖల అధికారులు హాజరుకావాలని కోరారు.

ఈకేవైసీ నమోదు చేసుకోండి

ప్రజాశక్తి-పుట్లూరు

ఈ క్రాప్ నమోదు చేసుకున్న రైతులు ఈకేవైసీ కూడా నమోదు చేసుకోవాలని మండల వ్యవసాయ అధికారి కాత్యాయని తెలిపారు. రబీ పంట నమోదు ప్రక్రియలో భాగంగా పుట్లూరు మండలంలో ఇప్పటివరకు 4746 రైతులకి 18384 ఎకరాల ఈ క్రాప్ బుకింగ్ చేశామన్నారు. ఇప్పటివరకు 3941 మంది రైతులు ఈకేవైసీ చేయించుకున్నారు. మిగిలిన 811 మంది రైతులు కూడా ఈకేవైసీ చేయించుకోవాలని సూచించారు. ఈనెల 25వ తేదీ లోపు తప్పనిసరిగా రైతు భరోసా కేంద్రాల్లో ఈకేవైసీ చేయించుకోవాలన్నారు. లేనిపక్షంలో క్రాప్ ఇన్సూరెన్స్, సున్నా వడ్డీ, పంట రుణాలు, ప్రభుత్వం అందించే ఇతర పథకాలకు అనర్హులవుతారని తెలియజేశారు.

కంటివైద్య శిబిరానికి స్పందన

ప్రజాశక్తి-నార్పల

మండల కేంద్రంలోని స్థానిక వాల్మీకి ఆలయ ప్రాంగణంలో మంగళవారం నిర్వహించిన కంటి వైద్య శిబిరానికి అనూహ్య స్పందన లభించింది. మొరుసు భాస్కర్‌రెడ్డి, బాలనాగి నరేష్ మిత్రబృందం ఆధ్వర్యంలో బెంగళూరు శంకర కంటి ఆసుపత్రి వారి సహకారంతో కంటి వైద్య శిబిరం నిర్వహించారు. శింగనమల నియోజకవర్గ వ్యాప్తంగా వృద్ధులు పెద్ద ఎత్తున తరలివచ్చి కంటి పరీక్షలు చేయించుకున్నారు. 85 మందిని ఆపరేషన్ల కోసం ఎంపిక చేశారు. భోజన సౌకర్యం కల్పించారు.

వెండి వస్తువుల బహూకరణ

ఉరవకొండ : ఉరవకొండ మండలం పెన్నహోబిలం శ్రీలక్ష్మీనరసింహ స్వామి దేవస్థానానికి కర్ణాటక రాష్ట్రం బెంగళూరుకు రిటైర్డ్ చీఫ్ జస్టిస్ శ్రీధర్‌రావు, కె.విజయలక్ష్మి రూ.1.52 లక్షల విలువజేసే వెండి వస్తువులను మంగళవారం బహూకరించినట్లు ఆలయ ఈవో కె.విజయ్‌కుమార్ విలేకరులకు తెలిపారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ 2.627 కేజేల వెండి వస్తువులు (17 బాగాలు) కిరీటములు -3, వక్షస్థలాలు -3, హస్తాలు -6, శంకు చక్రాలు-2, పాదస్థిరాలు-3, ఉత్సవ విగ్రహాల అలంకరణ నిమిత్తం బహూకరించారని తెలిపారు. ప్రధాన అర్చకులు ఎఎన్ ద్వారకనాథాచార్యులు, ఎం.బాలాజీ పాల్గొన్నారు.

సచివాలయ సిబ్బంది నిర్లక్ష్యం వీడాలి..

ఎంపిపి భూమిరెడ్డి గారి రాఘవరెడ్డి

ప్రజాశక్తి-పుట్లూరు

కొంతమంది సచివాలయ సిబ్బంది నిర్లక్ష్యం వల్ల చాలా మంది ప్రభుత్వ పథకాలకు దూరమవుతున్నారని, ఇది మానుకోవాలని ఎంపీపీ భూమిరెడ్డి గారి రాఘవరెడ్డి సూచించారు. మంగళవారం స్థానిక ఎంపీడీవో కార్యాలయంలో ఎంపీపీ రాఘవరెడ్డి అధ్యక్షతన సర్వసభ సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా ఎంపిపి మాట్లాడుతూ సచివాలయంలోని కొంతమంది సిబ్బంది అర్జీలను పరిష్కరించకుండా నిర్లక్ష్యం చేయడం వల్ల అర్హులకు ప్రభుత్వ పథకాలు అందకుండా పోతున్నాయని అన్నారు. ప్రజలు కార్యాలయాల చుట్టూ తిరక్కుండా ఉండేందుకు సిఎం జగన్‌మోహన్‌రెడ్డి సచివాలయ వ్యవస్థను తీసుకొచ్చారన్నారు. సిబ్బంది నిర్లక్ష్యం వహిస్తే చర్యలు తప్పవని హెచ్చరించారు. అనంతరం వివిధ శాఖల అధికారులు అభివృద్ధి పనుల గురించి వివరించారు. ఈ కార్యక్రమంలో ఎంపీడీవో యోగానంద రెడ్డి, డిప్యూటీ తహశీల్దారు మల్లేష్ ప్రసాద్, ఎంఇఒ శ్రీవాణి, ఈవోఆర్డీ ఆనంద ప్రసాద్, మండల ఇంజినీర్ వెలమనాయుడు, వివిధ శాఖల అధికారులు, సర్పంచులు మహేశ్వర్‌రెడ్డి, రామానుజులరెడ్డి, ఓబులేష్, ఎంపీటీసీలు పాల్గొన్నారు.

మాట్లాడుతున్న ఎంపిపి భూమిరెడ్డిగారి రాఘవరెడ్డి